# ఉపోద్ఘాతము

## రచయిత

గలతీయలో ఉన్న సంఘములకు వ్రాసిన పత్రిక యొక్క రచయిత అపొస్తలుడైన పౌలు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1:1 మరియు 5:2లో ఆయనే స్వయంగా ఈ పత్రికా రచయితగా చెప్పుకున్నాడు, అతడు గ్రంథకర్త కాదనుటకు ఎలాంటి నమ్మదగిన సవాలు లేదు. క్రీ.శ. రెండవ శతాబ్దపు ప్రారంభమునాటికి, ఈ గలతీయులకు వ్రాసిన పత్రిక పౌలుచే రచించబడినట్లుగా గుర్తింపునొందింది.[1]

## గ్రహీతలు

పౌలు తన పత్రికను "గలతీయలో నున్న సంఘములకు" (1:2) అని సంబోధిస్తూ వ్రాసాడు. క్రొత్త నిబంధనలోని గలతీయులు ఖచ్చితముగా ఎవరు అనేది ఒక ప్రశ్నగానే మిగిలింది మరియు ఈ విషయముపైనే పరిశుద్ధ గ్రంథముపై పరిశోధన చేసే పండితులు ఎందరో విభజింపబడ్డారు. ఈ గలతీయకు చెందిన ప్రజలు ఎక్కడ నుండి వచ్చారు అనే విషయముపై మాత్రము ఒక ఏకాభిప్రాయము ఉంది: వారు సెల్టిక్ ప్రాంతానికి చెందినవారు, గ్రీసు-రోమా రచయితలచే *Celtae*, *Galatae*, or *Galli* అని పిలిచేవారు. ప్రాచీన గ్రీసు చరిత్రకారుడొకరు వీరిని *Celtae*గా, అంటే *Celts* లుగా పిలిచాడు. క్రీ.పూ. మూడవ శతాబ్దము వరకు కూడా *Galatae*, లేదా "గలతీయులు" అనబడేవారిని గూర్చి సాహిత్యములో చదవము.[2] నేటికాలపు ఫ్రాన్సు ప్రాంతము, లేదా ఆనాడు రోమీయుల ఆధీనములో ఉన్న *Gallia* (గాల్) ప్రాంతము నుండి ఈ గలతీయులకు మూలాలు వచ్చాయి అనేది సాధారణంగా అంగీకారయోగ్యమైన విషయము, ఈ ప్రాంతపు నివాసులనే రోమీయులు *Galli* అని పిలిచేవారు.[3] ఈ గల్లీ భాషను మాట్లాడే వారిలో కొంతమంది ఇంకను ఫ్రాన్సులో, బ్రిటిష్ దీవులలో మరియు తదితర ప్రాంతములలో ఉన్నారు.[4]

ఐరోపా ఖండమునకు పశ్చిమాన ఉండవలసిన ఈ "గలతీయులు" తమ సొంత ప్రాంతమునకు చాలా దూరమునకు ఎలా వెళ్లిపోయారు? ప్రజల యొక్క లేదా గోత్రముల యొక్క వలసలకు సంబంధించిన ఈ ప్రశ్న చాలా రహస్యమైనది - ఇట్టి సంఘటన ప్రపంచములోని అనేకమైన ప్రాంతములలో కూడా చోటుచేసుకుంది. ఈ విధమైన వలసలకు అనేకమైన కారణములు ఉండేవి, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక కారణములు (అంటే అధిక జనాభా సమస్య వంటివి), మరియు ఇతర గోత్రములు లేదా ప్రజల యొక్క వలసల వలన కలిగిన ఒత్తిడి - ఇవన్నీ కారణాలు

కావచ్చు.

క్రీ.పూ. నాల్గవ శతాబ్దములోనే, నేడు ఇటలీగా చెప్పబడుతున్న ఆ ద్వీపకల్పమునకు చాల మంది సెల్టిక్ ప్రజలు దక్షిణ దిశగా వలస వచ్చారు. వారు రోమును స్వాధీనపరచుకొని ఆ పట్టణములోని అనేకమైన ప్రాచీన పురావస్తువులను మరియు హద్దుగుర్తులను నాశనము చేసారు. తరువాత, దరిదాపుగా క్రీ.పూ. 279లో, మరొక పెద్ద వలస తూర్పు ప్రాంతమునకు వచ్చి ఆ తరువాత మాసిదోనియా మీదుగా దక్షిణ దిక్కునకు వచ్చారు; ఈ సంఖ్యలో కొంతమంది మధ్య గ్రీసు ప్రాంతమునకు, డెల్ఫీలో ఉన్న పైథియన్ అనబడే ప్రాచీన గ్రీకు ఆలయమంత దూరమునకు తరలి వెళ్లారు. ఈ వలస వెనుక ఉన్న కారణం బహుశ బంగారము, వెండి మరియు ఇతర నిధులను దొంగిలించుటకు అయి ఉండవచ్చు. ఈ నిధులు శతాబ్దాలుగా సామంతుల నుండి బహూకరణలుగా మరియు విజయ చిహ్నములుగా సంపాదించినవే; వీటిని అపొల్లోలోని వివిధమైన గుప్తనిధి గృహాల్లో నిల్వ ఉంచేవారు. పురాతన కథనము ప్రకారము, అపొల్లో స్వయంగా తాత్కాలిక వర్షాలు, ఉరుము మరియు మెరుపులతో జోక్యం చేసుకున్నాడు. ఈ భీకరమైన క్రియల వలన ఈ ఆలయము నిర్మించబడిన పర్నాస్సుస్ అనబడే పర్వత పునాదులు కదిలి ప్రయాణము చేయువారిపై మరణమును మరియు నాశనమును తెచ్చిపెట్టింది మరియు దీని వలన తరువాత కాలములో గ్రీకుల ప్రాంతములపై ప్రయాణములు చేయుటను నిరోధించింది అని ఈ కథన సారాంశము.[5]

ఉత్తర ప్రాంతమునకు వచ్చి తమ మూల సమూహములతో కలిసిన తరువాత, ఈ గాల్ అనబడే ప్రజలు Hellespont అనబడే ప్రాంతమును దాటి ఆసియా మైనర్ లోనికి వచ్చారు. Halys అనబడే నదికి ఈశాన్యమున మరియు పశ్చిమాన మూడు ప్రధాన గోత్రములుగా వీరు స్థిరపడ్డారు, తరువాత ఇదే గలతీయగా చెప్పబడింది. ఇక్కడ వారు తమ మూడు ప్రధానమైన పట్టణములను స్థాపించారు, అవి పెస్సినస్, టావియం, మరియు అంకిరా (ఆధునిక అంకరా). ఈ మూడు పట్టణములలో ఆఖరు పేర్కొనబడినది క్రమక్రమంగా గలతీయ వారందరికి రాజధానిగా మారింది.[6]

ఈ గలతీయులు అనబడే జాతివారు క్రమేపి ఆసియా మైనర్ లోని వారందరికి ఒక కొరడాగా మారారు. వీరి యొక్క సైన్యములు వేరేవారి పట్టణముల గుమ్మముల వద్దకు వెళ్లి ఆ పట్టణ వాసులకు రెండే రెండు అవకాశములు ఇచ్చేవారు - వీరికి కప్పము చెల్లించడం లేదా నాశనమును ఎదుర్కోవడం. క్రీ.పూ. 230లో, అనగా పెర్గమ రాజైన అట్టలుస్ I వీరిపై యుద్ధము చేసి ఓడించనంత వరకు, ఈ ప్రాంతముపై గలతీయుల యొక్క తిరుగుబాటు ముగియలేదు. ఈ పెర్గమనీయుల విజయమునకు స్మారక చిహ్నమును చూడాలంటే, జీయుస్ అనే దేవతకు ఈ పెర్గమీయులు కట్టించిన బలిపీఠము యొక్క 446 అడుగుల పీఠభాగమును కప్పిన తివాచీలో చిత్రీకరించబడియున్న మనిషి కంటే ఎత్తైన పాలరాతి శిల్పము రూపములలో చూడవచ్చు. ఈ బలిపీఠములోని కొంత భాగమును జర్మనీ దేశమునకు చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు బెర్లిన్ అనే ప్రాంతమునకు తరలించి, పునఃనిర్మించి, దీనిని ప్రసిద్ధిగాంచిన పెర్గమం మ్యూజియంలో కేంద్ర బిందువుగా ఉంచారు. తుదకు, నాటికాలపు పరివ్యాప్తి గ్రీకుల చేతిక్రింద ఈ సెల్టిక్ జాతివారు కూడా తమ పొరుగు జాతుల

వలెనే లొంగిపోయారు, తరువాత వారి భాషలోను మరియు సంస్కృతిలోను గ్రీకులుగా మారిపోయారు.

ఉత్తర దిక్కున ఉన్న ఈ గలతీ జాతివారికేనా ఈ పత్రికను పౌలు వ్రాస్తున్నది, లేదా గలతీయ అనబడిన గ్రీకుపాలిత ప్రాంతములోని కొన్ని ప్రత్యేక సంఘములకు వ్రాశాడా?[7] ఈ విషయముపై, రెండు గుంపులుగా పండితులు విభజించబడ్డారు. ఒక గుంపు పండితులు "ఉత్తర గలతీయ సిద్ధాంతము"ను నమ్ముతారు, వీరిలో అధికమైన జర్మనీ వేదశాస్త్రజ్ఞులు మరియు మరింత ఉదారవాద పండితులు ఉన్నారు. రెండవ గుంపు పండితులు "దక్షిణ గలతీయ సిద్ధాంతము"ను నమ్ముతారు. మరింత సంప్రదాయవాదముగా ఉంది, ఎక్కువ శాతము బ్రిటీష్ మరియు అమెరికాకు చెందిన పండితులచే నమ్మబడుతున్న ఈ దక్షిణ గలతీయ సిద్ధాంతము ప్రకారముగా అపొస్తలుల కార్యములు పుస్తకములో లూకా పేర్కొన్న ఆ సంఘములకు ఈ గలతీ పత్రిక వ్రాయబడింది అని తెలుస్తుంది. తమ మొదటి సువార్త ప్రయాణ సందర్భముగా పౌలు మరియు తన జతపనివారు అందరు ఈ సంఘములను స్థాపించారు (అపొ. 13:14). ప్రత్యేకముగా, అంతియొకయ, ఈకొనియ, లుస్త్ర, మరియు దెర్బే అనే సంఘములు ఉండేవి, ఇవన్నియు కూడా రోమాపాలిత గలతీయలో దక్షిణ భాగమున ఉండిన పట్టణములే.

అపొస్తలుల కార్యముల పుస్తకములో పౌలు మరియు తన జతపనివారల సువార్తపనిని నమోదు చేసిన విషయమునకొస్తే, ఉత్తర గలతీయ ప్రాంతములో ఉన్న Pessinus, Tavium, లేక Ancyra అనే పట్టణములను ఎక్కడ పేర్కొనలేదు. నిజానికి, ఈ పట్టణములు ఎప్పుడు కూడా క్రొత్తనిబంధనలో పేర్కొనబడనే లేదు. తమ ఆలోచనను బలోపేతము చేసుకోవడానికి ఉత్తర గలతీయ సిద్ధాంత వాదులు ఎన్ని వాదనలు వినిపించినప్పటికీ, అసలు పౌలు మరియు తన జతపనివారు ఈ ఉత్తర దిక్కున ఉన్న పట్టణములను దర్శించారా అనడానికి అసలు ఆధారములే లేవు. ఇట్లుండగా, "ఉత్తర గలతీయ సిద్ధాంతము"ను వాదించే వారు దేనిపై తమ వాదనలను ఆధారము చేసికొనుచున్నారు?

## ఉత్తర గలతీయ సిద్ధాంతము

Werner Georg Kümmel అనే రచయిత మాట్లాడుతూ, 3:1లో పౌలు "ఓ అవివేకులైన గలతీయులారా" అని గద్దించినప్పుడు, గలతీయ సీమప్రాంతములో నివసించేవారిని ఉద్దేశించి మాట్లాడాడు అనియు, మరింత పెద్దదైన దక్షిణ గలతీ సీమలో ఉండే పొరుగు తెగలైన లుకయొనియ మరియు పిసిదియలను పేరు చేసి మాట్లాడాడు అనే ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచాడు. అపొస్తలుల కార్యములు పుస్తకములో లూకా ప్రయోగించిన భాషను మరియు ఆనాటి కాలపు రచయితలు గలతీ జాతివారికిని మరియు వారి పొరుగు జాతుల వారికిని మధ్యనున్న వ్యత్యాసమును తెలిపే విధానమును ఆధారము చేసికొని Kümmel ఉత్తర గలతీలోని జాతుల గుర్తింపును ప్రత్యేకముగా చూపాడు.[8]

గలతీయులకు పత్రిక ఆరంభ అధ్యాయములో[9] పౌలు తనగూర్చి వ్రాసిన మాటలను ఆధారము చేసికొని పౌలు మనసులో గలతీయులను గూర్చి మాట్లాడినప్పుడు గలతీ జాతివారు ఒకప్రక్కన మరియు దక్షిణ దిక్కున ఉన్న గోత్రముల వారు మరొక ప్రక్కన ఉన్నారు అనే వాదనను Kümmel సూచించాడు. ఈ పత్రికలో పౌలు కేవలము దక్షిణ గలతీయ ప్రాంతముల వారిని మాత్రమే ఉద్దేశించి మాట్లాడుతున్నట్లయితే, తను శుభవచనములను వ్రాసినప్పుడు దక్షిణ గలతీయ (లుకయోనియ మరియు పిసిదియ) ప్రాంతములను ప్రత్యేకముగా పేర్కొనేవాడే అని Kümmel అభిప్రాయపడ్డాడు.[10]

అపొస్తలుల కార్యములు 14:6లో లూకా లుస్త్ర మరియు దెర్బే అనే పట్టణములను “లుకయోనియ పట్టణములు”గా (గలతీయలోని పట్టణములుగా కాక) పరిగణించడం మరియు లూకా ఈ పుస్తకమును వ్రాస్తున్నప్పుడు సమకాలీన భాషను ప్రయోగిస్తున్నాడు అనే వాదనలను ఆధారము చేసికొని J. B. Lightfoot అనే రచయిత ఉత్తర సిద్ధాంతమునకు మద్దతు పలికాడు.[11] దక్షిణ సిద్ధాంతము యొక్క ఆధారములు ఇంకను దృఢపరచబడుతున్న నేపథ్యంలోనే Lightfoot ఈ ఉత్తర సిద్ధాంతమునకు మద్దతు పలుకుతూ ముందుకు వచ్చాడనే విషయాన్ని గుర్తించాలి.

ప్రారంభ క్రైస్తవ చరిత్ర విశదీకరణలో ఆద్యుడైన జర్మనీ పండితులలో ఒకరైన Ferdinand Christian Baur అనే రచయిత మాట్లాడుతూ గలతీయులకు వ్రాసిన పత్రికకు శ్రోతలు గలతీ జాతివారు అని సూచించాడు. కానీ, అనేకమైన ప్రయోగాత్మక ఉద్దేశములతో Baur తనంతటతానే ఈ విషయముపై అధికారిక పండితునిగా తన్నుతాను అనర్హునిగా చేసుకున్నాడు. అపొస్తలుల కార్యములు పుస్తకమును గూర్చి మాట్లాడుతూ “సంఘము యొక్క ఐక్యత కొనసాగించబడులాగున” ఈ పుస్తకము యూదా మతము నుండి క్రైస్తవులుగా మారినవారికిని మరియు అన్యజనుల నుండి క్రైస్తవులుగా మారినవారికిని మధ్య “ఉన్న అసమ్మతులకు సంబంధించిన ఆధారాలను మాపుచేయడానికి చేయబడిన ఒక ఆఖరు ప్రయత్నము”గా పరిగణిస్తూ ఈ పుస్తకము యొక్క అధికారాన్ని విస్మరించాడు.[12] ఈ విధమైన ఆలోచనలు చేసే క్రమములో Baur కనీసం పౌలు మరియు తన జతపనివారలు ప్రయాణించిన మార్గమును కూడా పరిశోధించకుండడం ఆశ్చర్యకరం.

## దక్షిణ గలతీయ సిద్ధాంతము

తన కాలముకంటే మునుపే “దక్షిణ గలతీయ సిద్ధాంతము” ప్రతిపాదించబడినప్పటికీ, ఆసియా మైనర్ లోని స్థలములనందు ఆయన చేసిన ప్రారంభ కార్యములను బట్టియు మరియు ఉచ్చస్థాయిగల సాహిత్యములో తన అధ్యయనము బట్టియు William M. Ramsay (1851-1939) ఒక ప్రసిద్ధి చెందిన రచయిత. మొదటిలో Ramsay కూడా ఉత్తర సిద్ధాంతమును మరియు పౌలు పరిచర్యను గూర్చి Baur చేసిన కాలక్రమమును అంగీకరించాడు. ఆ మీదట తన సొంత కనువిప్పుల వలన తన ఆచార్యుని ఆలోచనలను తిరస్కరించాడు. ఈ పెద్ద పరిశోధన తరువాత Ramsay

దక్షిణ గలతీయ ఆలోచనా విధానమునకు మద్దతుదారునిగా మారాడు.

పత్రిక యొక్క వ్యాఖ్యాతలు "పౌలు ఈ పత్రికను ఉత్తరభాగమున ఉన్న గలతీయులకు వ్రాసాడు అనే ఆలోచనలో మునిగిపోయి"[13] ఈ విషయములోని చారిత్రక కోణాన్ని అధ్యయనం చేయడానికి మొగ్గు చూపుటలేదు అనే ఒక బాధతో తన విచారణను Ramsay ప్రారంభించాడు. ఇలా చేయకుండా, ఈ వ్యాఖ్యాతలు తమలో ముందే అనుకున్న కొన్ని ఆలోచనలకు బలమును చేకూర్చే విధంగా కొన్ని వాస్తవాలను అనాలోచితముగా తీసుకుంటారు. "క్రీ.శ. 50లో నిజముగా గలతీయ ఎలా ఉందో అలా చూపడానికి" ఆయన చాల ప్రయాసపడ్డాడు.[14]

దక్షిణ గలతీయ సిద్ధాంతమునకు ఆధారములుగా అనేక విషయాలు చెప్పవచ్చు గానీ, కొన్నింటిని ఇక్కడ చూద్దాం.

*పౌలు యొక్క పరిచర్య కాలములో, గలతీయ జాతి యొక్క సీమ ప్రాంతము దక్షిణ ప్రాంతమంతటి అభివృద్ధి పొందినది కాదు.* దక్షిణ భాగమున ఉన్న పట్టణముల గుండా ఎంతో వాణిజ్యము జరిగేది, కాని గరుకుగా ఉండే ఉత్తర ప్రాంతములో ఎక్కువ వాణిజ్యము జరిగేది కాదు.[15]

*రోమా పాలిత ప్రాంతములలో ప్రధాన రహదారులకు సమీపముగా ఉన్న పట్టణములపై పౌలు ఎక్కువగా దృష్టించడం అనేది చూస్తే క్రైస్తవ్యం ఆసియా మైనర్ లోనికి ఎలా వ్యాప్తి చెందిందో తెలుస్తుంది.* ఒకటి తూర్పున ఉన్న సిరియా ప్రాంతము నుండి బయలుదేరి పశ్చిమాన ఉన్న ఈకొనియలోని కిలికియ ద్వారముల ద్వారా ఎఫెసు వరకు వచ్చేది. మిగతా రెండు దారులు చూస్తే, ఒకటి ఫిలదెల్ఫియ నుండి త్రోయ వరకు భూమార్గము, మరియు మరొకటి ఉత్తర దిశగా కిలికియ ద్వారముల గుండా తయాన మరియు కైసరయ (కప్పదోకియలో) నుండి అమిసో (నేటి సామ్సున్) వరకు, నల్ల సముద్రములోని మార్గము.[16] ఈ దారులలో ఏ ఒక్కటి కూడా గలతీయ జాతి ఉన్న సీమ గుండా వెళ్లేవి కావు, కాబట్టి ఉత్తర సిద్ధాంతాన్ని ఇవి బలపరచడం లేదు.

*గలతీయులకు బర్నబా చాలా పరిచితమైన వ్యక్తి అన్నట్లుగా పౌలు తమ పత్రికలో మూడుసార్లు బర్నబాను గూర్చి వ్రాసాడు (2:1, 9, 13).* దీని ప్రకారం చూస్తే వారు మొదటి సువార్త ప్రయాణములో ఉన్నప్పుడే ఇక్కడకు వచ్చినట్లు అనిపిస్తుంది (అపొ. 13; 14), ఈ అధ్యాయములలో దక్షిణ ప్రాంతములలో సంఘములను స్థాపిస్తూ బర్నబా పౌలుతో ఉన్నట్లుగా లూకా నమోదు చేసాడు. తరువాత, యోహాను అను మారుపేరు గల మార్కు విషయయములో కొన్ని విబేధాలు వచ్చినతరువాత, బర్నబా మరియు పౌలు రెండు వ్యతిరేక మార్గములలో ప్రయాణించారు (అపొ. 15:36-41). ఫలితముగా, తన రెండవ మరియు మూడవ సువార్త ప్రయాణములలో బర్నబా పౌలుతో లేడు (అపొ. 16:1-21:16).[17] ఒకవేళ పౌలు ఉత్తర గలతీయ ప్రాంతమునకు వెళ్లియుండినప్పటికీ, బర్నబా తనతో ఉండి ఉండడు. కాబట్టి, ఆ గలతీ జాతి ప్రజలచే బర్నబా అంత బాగుగా తెలియబడినవాడు కాడు.

*తను ఎవరినుద్దేశించి పత్రిక వ్రాస్తున్నాడో* (పిసిదియ అంతియొకయ, లుస్త్ర, ఈకొనియ, దెర్బే వాసులు) *వారిని సంబోధించుటకుగాను "గలతీయులు" (3:1) అనే పదమును పౌలు చాల సమగ్రముగా ప్రయోగించాడు.*[18] ఈ సందేశము ప్రత్యేకముగా

గలతీయ జాతివారు ఉన్న పట్టణములకు వ్రాయబడినది కాదు. క్రీ.పూ. 232 మొదట్లో, గలతీయ అనే ప్రదేశము గాలీయుల సంతానమునకు మరియు వీరు బానిసలుగా చేసుకున్న ఫ్రిగియన్లుకును నివాస స్థలముగా ఉన్నట్లు తెలుస్తుంది. తమపై దండెత్తి వస్తున్న శత్రు సైన్యముపై సహకరించమని బలవంతము చేయబడినప్పుడు, ఈ రెండు ప్రత్యేక ప్రజా జాతులవారిని తమ శత్రువులు (అలాగే తరువాత చరిత్రకారులు) వారు గాలీయుల సంతతివారా లేదా ఫ్రిగియన్ల సంతతివారా అనే బేధము లేకుండా వారి రక్తసంబంధీకులతో కలిపి కాకుండా, మామూలుగా *గలతీయులు*, అంటే గలతీ యొక్క ప్రజలు అని మాత్రమే పరిగణించారు.[19]

*గ్రీకువాడైన లూకా "గలతీ ప్రాంతమును" సంబోధించగా (అపొ. 16:6; 18:23), తన ఆలోచనలో ఎక్కువ శాతము రోమీయుడైన పౌలు మాత్రము కేవలము "గలతీయులు" అని సంబోధించాడు.* వారిని గూర్చి సంబోధించినప్పుడు పౌలు మనసులో ఈ గలతీ జాతి ప్రజలు ఉన్నట్లయితే (గలతీ. 3:1), మరియు ఇదే సీమను గూర్చి లూకా సంబోధించినట్లయితే, లూకా కూడా "గలతీ ప్రాంతము" అని కాకుండా "గలతీయులు" అనే మాటను ఎందుకు ఉపయోగించి ఉండ కూడదు? గ్రీకు మరియు లాటిన్ రచయితలు సాధారణంగా ఆ జాతిగల ప్రాంతాన్ని "గలతీ ప్రాంతము" అనో లేక "గలతీ సీమ" అనో కాక "గలతీయ" అని మాత్రమే సంబోధించారు అని Ramsay యొక్క పరిశోధన కనుగొంది. (Ramsay పరిశీలనలో) పౌలు మరియు లూకాలు దక్షిణ గలతీయ ప్రాంతమును సంబోదిస్తున్నారు గనుక. గలతీయ ప్రాంతమంతటితో కూడుకొని ఉన్న ప్రాంతమును సంబోధించే గ్రీకు శైలిని లూకా అనుసరించగా, పౌలు మాత్రము ఇదే ప్రాంతవాసులను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు రోమీయుల శైలిని అనుసరించాడు.[20]

*దక్షిణ గలతీయ సిద్ధాంతమునకు బలమైన అంశము, మరియు ఉత్తర గలతీయ సిద్ధాంతమును బలహీన పరచే అంశము ఏమంటే, ఆ కాలమునకు చెందిన పురావస్తు శాస్త్ర రచనలలోను మరియు సాహిత్యములో ఉన్న నిశ్శబ్దం.* గలతీయ సీమలో పౌలు స్థాపించిన సంఘములను గూర్చి ఏ ఒక్క నమోదు మనకు కనబడదు. (1) ఉత్తర భాగములో సంఘముల స్థాపనను గూర్చి అపొస్తలుల కార్యములు చాలా మౌనంగా ఉంది, కాగా లూకా మాత్రము పెద్దదైన గలతీయ ప్రాంతములో సంఘముల స్థాపనను గూర్చి మాట్లాడుతున్నాడు. (2) పౌలు ఉత్తర ప్రాంతములను దర్శించాడు అనడానికి ఏ విధమైన ఆధారము కూడా భద్రపరచబడలేదు. దీని అర్థం ఆయన ఎన్నడు అక్కడకు వెళ్లలేదు అని కాదు, కాని అలా వెళ్లాడు అనడానికి ఎటువంటి ఆధారములు లేవు. (3) మొదటి శతాబ్దములో ఉత్తర భాగములో సంఘములు మనుగడలో ఉన్నాయి అనడానికి ఎటువంటి ఆధారములు కూడా లేవు.

పైన పేర్కొనబడిన అనేకమైన ఆధారములను ఆధారము చేసికొని తన పత్రికలో సంబోధించిన గలతీయులు ఎవరు అంటే పౌలు మరియు బర్నబాలు తమ సువార్త ప్రయాణములో పరిచర్యచేసిన ఆ గలతీయులే. ప్రత్యేకముగా, పిసిదియ అంతియొకయ, ఈకొనియ, లుస్త్ర, దెర్బే తదితర ప్రాంతములలో ఉన్న క్రైస్తవులను ఈ పదములో యిమడ్చవచ్చు - ఈ ప్రాంతములే అపొస్తలుల కార్యములు పుస్తకములో లూకా యొక్క నివేదికలో కూడా పేర్కొనబడినవి.

## ఈ పత్రిక ఉద్భవించిన తేదీ మరియు స్థలము

గలతీయులకు వ్రాసిన పత్రిక యొక్క తేదీని అంచనా వేయడం కష్టం మరియు పౌలు ఉద్దేశించిన శ్రోతలపై ఇది ఆధారపడి ఉంటుంది. సుస్పష్టంగా, తన యొక్క చదవరులు ఎక్కువగా గలతీ అనబడే పెద్దదైన రోమా పాలిత ప్రాంతమునకు చెందినవారే (దక్షిణ గలతీ సిద్ధాంతము) కాని గలతీ జాతి వారు ఉండే సీమ ప్రాంతమునకు చెందినవారు కాదు (ఉత్తర గలతీ సిద్ధాంతము).

ఈ గలతీయులకు వ్రాసిన పత్రిక యొక్క రచనా తేదీ విషయమై వివిధమైన పండితులచే క్రీ.శ. 48 నుండి 63 సంవత్సరముల మధ్య, వివిధమైన తేదీలు ప్రతిపాదించబడ్డాయి. Robert L. Johnson అనే రచయిత ఈ క్రింద పేర్కొనబడిన అనేక తేదీలను మరియు స్థలాలను సూచించాడు:

1. మొదటి సువార్త ప్రయాణము జరిగిన వెంటనే మరియు యెరూషలేములో సభ జరుగక మునుపు (అపొ. 15), అంటే క్రీ.శ. 48-49 మధ్య అంతియొకయ (సిరియా)లో వ్రాయబడి ఉంటుంది.
2. యెరూషలేములో (అపొ. 15) సభ జరిగిన వెంటనే క్రీ.శ. 49-50 మధ్య, అంతియొకయలో (సిరియా) వ్రాయబడి ఉంటుంది.
3. రెండవ సువార్త ప్రయాణము ముగింపు సమయములో క్రీ.శ. 52-54 మధ్య కొరింథులో వ్రాయబడి ఉంటుంది.
4. రెండవ సువార్త ప్రయాణము తరువాత, అంతియొకయలో (సిరియా) వ్రాయబడి ఉంటుంది.
5. మూడవ సువార్త ప్రయాణములో పౌలు ఎఫెసుకు చేరిన వెంటనే, లేదా మాసిదోనియ వెళ్లుటకు పౌలు ఎఫెసును విడచుటకు మునుపు, క్రీ.శ. 55-57 మధ్య, ఎఫెసులో వ్రాయబడి ఉంటుంది.
6. మూడవ సువార్త ప్రయాణములో మాసిదోనియలో, క్రీ. శ. 56-57 మధ్య వ్రాయబడి ఉంటుంది.
7. మూడవ ప్రయాణములో రోమీయులకు పత్రికను వ్రాయుటకు మునుపు, క్రీ.శ. 57-58 మధ్య కొరింథులో వ్రాయబడి ఉంటుంది.
8. గలతీయులకు పత్రిక అనేది రోమాలో బందీగా ఉన్నప్పుడు, క్రీ.శ. 61-63 మధ్య, చెరసాలలో నుండి వ్రాయబడి ఉంటుంది అనే ఊహాగానము (చాలా తక్కువ అవకాశము).[21]

వీటికంటే కూడా మరింత తదుపరి తేదీలను ప్రతిపాదించుటకు మంచి కారణములనే ఇవ్వగలిగినప్పటికీ,[22] ఈ పత్రిక గలతీలోని సంఘములకు మరింత మునుపటి తేదీలోనే, అనగా క్రీ.శ. 48-49 మధ్యకాలములో వ్రాయబడి ఉంటుంది. ఈ తేదీ ఈ పత్రిక యొక్క రచనా కాలమును మొదటి సువార్త ప్రయాణము ముగింపులో, అనగా పౌలు ఇంకను సిరియాలోని అంతియొకయలో (అపొ. 14:26-28) ఉన్నప్పుడు, మరియు యెరూషలేములో జరుగనైయున్న సభకు హాజరగుటకు బర్నబాతో పౌలు

ప్రయాణించుటకు మునుపు (అపో. 15:1-29) వ్రాయబడి ఉంటుంది.

ఈ పత్రికకు మరింత మునుపటి తేదీని కేటాయించుటకు రెండు అంశాలు మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. (1) సున్నతి విషయమై చర్చించి తగు నిర్ణయములు తీసుకొనే ఉద్దేశంతో జరిగిన యెరూషలేము సభను గూర్చి ఈ పత్రిక ప్రస్తావించడం లేదు.[23] (2) ఈ సభలో తీసుకున్న నిర్ణయాలలో కొన్నింటిని పౌలు తన రెండవ సువార్త ప్రయాణములో ప్రస్తావించాడు (అపో. 16:4). సభ నుండి కొన్ని ఉత్తర్వులను స్వీకరించి ఆ తరువాత తన రెండవ సువార్త ప్రయాణములో వాటిలో కొన్నిటిని సంఘములకు అందించిన తరువాత కూడా, తన పత్రికలో వాటిని గూర్చి ప్రస్తావించక పోవడం - అంటే ఒకవేళ ఈ పత్రిక యెరూషలేములోని సభ జరిగిన *తరువాత* వ్రాయబడి ఉంటే - అనేది కొంత ఆశ్చర్యంగానే ఉంది.

అపొస్తలుల నుండి మరియు సంఘపెద్దల నుండి వచ్చిన యెరూషలేము పత్రిక అంతియొకయ, సిరియా, మరియు కిలికియలోని సహోదరుల పేరిట ఉన్నదనే విషయము (అపో. 15:23) బట్టి చూస్తే అసలు వివాదములకు దారితీసిన ఆ అంశములపైనే వారు చర్చించారు అనేది తెలుస్తుంది. సున్నతిని గూర్చిన వివాదము అసలు గలతీయలో లేవనేలేదు అనిగాని లేదా ఆ సభ జరుగక మునుపే పౌలు తన పత్రిక ద్వారా ఆ అంశమును గూర్చి చర్చించలేదు అని ఆలోచించడం అవసరం లేని విషయం. సిరియా అంతియొకయలో పేతురు, బర్నబా మరియు యూదులు చూపిన పిరికితనము మరియు పౌలు తరువాత చేసిన గద్దింపులు ఇవన్నియు కూడా ఈ పత్రికను వ్రాసినప్పుడు అపొస్తలుని మనసులో ఇంకను మెదులుతూనే ఉన్నాయి (గలతీ. 2:11, 12).

అత్యంత ఆమోదయోగ్యమైన తేదీ ఏమంటే పౌలు ఈ గలతీయులకు పత్రికను మునుపటి తేదీలోనే, సుమారు క్రీ.శ. 48-49 మధ్య, సిరియా అంతియొకయ నుండి వ్రాసాడు.

## సందర్భము మరియు ఉద్దేశము

లూకా యొక్క నివేదిక చెప్తున్నట్లుగానే, పౌలు మరియు బర్నబాలు గలతీ ప్రాంతమునకు వచ్చి మెస్సీయా యొక్క పరిహారార్థ మరణము మరియు పునరుత్థానములను గూర్చిన శుభవార్తను వారికి ప్రకటించారు (అపో. 13:23-42; గలతీ. 1:1, 4; 3:1 చూడండి). యేసునందలి విశ్వాసము ద్వారా ఒకరు పాపము నుండి విడుదల పొందుతారే గాని, ఈ విడుదల మోషే యొక్క ధర్మశాస్త్రము వలన కాదు (అపో. 13:39) అని ఈ మిషనరీలు ఉద్ఘాటించారు.

గలతీలో మారుమనస్సు పొందినవారిలో కొంతమంది యూదులు లేదా యూదామతాన్ని స్వీకరించిన వారు (అపో. 13:43; 14:1). ఈ యూదులకు సుదీర్ఘమైన మరియు మహిమగల చరిత్ర ఉంది. వీరు "దత్తపుత్రత్వమును మహిమయు నిబంధనలును ధర్మశాస్త్ర ప్రధానమును అర్చనాచారాదులును వాగ్దానములును" కలిగియున్నవారు (రోమా. 9:4). వారికి ప్రవక్తల యొక్కయు రాజుల యొక్కయు

వారసత్వము ఉంది అలాగే సొలొమోను నిర్మించిన మందిరము యొక్క మహిమయు మరియు హేరోదు పునఃనిర్మించిన మందిరమును ఉన్నవి. వారికి సున్నతి అనబడే ఆచారము కూడా ఉంది, ఇది వారి యూదా వారసత్వమునకును విశ్వాసమునకును సూచనగా ఉండినది. వారు ఇశ్రాయేలీయులు, దేవుడు ఏర్పాటు చేసుకున్న జనాంగము.

ఈ విధమైన ధార్మిక సంప్రదాయములో, అనేకమైన అన్యజనులు మారుమనస్సు పొంది సంఘములో చేర్చబడ్డారు (గలతీ. 4:8, 9; అపొ. 13:48; 14:1). యూదా క్రైస్తవుల వలెనే, వీరు కూడా క్రీస్తు నందు విశ్వసించి ఆయనలో బాప్తిస్మము పొందినవారు (3:26, 27). ఇంకా చూస్తే, వారు పరిశుద్ధాత్మ అనుగ్రహించు అద్భుతకరమైన వరములు కూడా పొందారు (3:5). వారు కొంత కాలము పాటు దేవుని కృపలో కొనసాగారు, యేసునందు విశ్వాసములో ఎదిగారు. తమ ఆత్మీయ పురోగతికి దోహదపడులాగున ఈ సమాజములలో పెద్దలు కూడా నియమించబడ్డారు (అపొ. 14:23).

పౌలు ఈ ప్రాంతమును విడచి వెళ్లిపోయిన తరువాత, కొంతమంది యూదావాదులు[24] గలతీయుల యొద్దకు వచ్చి, అసలు ఏ మాత్రమును "శుభవార్త" కానటువంటి ఒక "భిన్నమైన సువార్త"ను వీరికి బోధించారు (గలతీ. 1:6, 7). ఈ అబద్ధ బోధకుల బోధ ఏమంటే, యేసునందు విశ్వాసముంచి ఆయనలో బాప్తిస్మము పొందుటతో పాటుగా (3:27), రక్షింపబడుటకు ఒకరు మోషే యొక్క ధర్మశాస్త్రమును కూడా పాటించాలి అనేది (4:21; 5:1; అపొ. 5:1). సున్నతి (5:2) మరియు నియమిత దినముల (4:10) ఆచరణ వంటి వాటిని మారుమనస్సు పొందినవారిపై బలవంతము చేయుచున్నారు. తమ అబద్ధ సిద్ధాంతముల ద్వారా వీరు సమాజములలో వారిని కలవరపెడుతూ, వారి మధ్యలో అనైక్యతను కలిగిస్తున్నారు (5:10, 12). ఇదియుగాక పౌలు యొక్క అపొస్తలత్వమును గూర్చియు మరియు ఆయన ప్రకటిస్తున్న ధర్మశాస్త్ర-రహిత సువార్తను గూర్చియు తేలికగా మాట్లాడుతున్నారు (1:11-2:21).

ఈ యూదావాదుల యొక్క ఆలోచనలు బహుశా మూడు విధములుగా ఉండవచ్చు. మొదటిగా, ఒకరు క్రైస్తవునిగా మారాలంటే ముందు యూదునిగా మారాలి అనేది వారి భావన (అపొ. 15:1). ఒకరు యూదునిగా మారకుండా యూదా గోత్రమునకు చెందినా మెస్సీయాను ఎలా అనుసరించగలరా అనేది వారు అర్థం చేసుకొనలేకపోయారు. ఇంకా చూస్తే, అప్పుడే అన్యమతముల నుండి మారుమనస్సు పొంది క్రైస్తవులుగా మారిన వారిపై ధర్మశాస్త్రమునకు నిరోధక విలువ ఉన్నది అని వారు ఆలోచించారు. దీనికి తోడు, తమ పొరుగు యూదులలో చాలా మంది పౌలు మరియు బర్నబాలు ప్రకటిస్తున్న ప్రకటనను నమ్మడానికి నిరాకరించారు; కొందరైతే వీరిని హింసించారు కూడా (అపొ. 13:45-50). క్రీస్తునందు విశ్వసిస్తున్న అన్యులైన వారు సున్నతి చేయబడి యూదామతమునకు మార్పిడి చెందడం ద్వారా సంఘము పట్ల వ్యతిరేకత చూపుతున్న అవిశ్వాసులైన యూదుల యొక్క శత్రుత్వమును తగ్గించవచ్చు అని యూదావాదులు ఆలోచించారు (గలతీ. 6:12). వారి ఆలోచనలు ఏమైనప్పటికీ, వారి సిద్ధాంతములను పౌలు చాలా బలంగా వ్యతిరేకించాడు (1:8, 9;

5:12).

పౌలు ఈ పత్రికను గలతీయులకు వ్రాయడానికి గల కారణం ఈ యూదావాదుల అబద్ధ బోధలను ఎదిరించడానికి. ధర్మశాస్త్రమునకు విధేయత చూపడం ద్వారా రక్షణ కలుగుతుంది అని నమ్మవద్దని తన యూదా క్రైస్తవులను హెచ్చరించాడు (3:10). ఇంకా చూస్తే, వారి ఆచారములను అన్యులుగా ఉండి క్రైస్తవులుగా మారిన వారిపై బలవంతము చేయవద్దని వారికి ఆదేశించాడు. మోషే యొక్క ధర్మశాస్త్రమునకు బానిసత్వము నుండి దూరముగా వెడలి వారందరు క్రీస్తునందు ఒకరే అనే విషయాన్ని గుర్తించాలని వారికి సూచించాడు: "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" (3:28).

## సంక్షిప్త వర్ణన

I. ప్రారంభ శుభవచనములు (1:1-5)

II. భిన్న సువార్త పట్ల పౌలు యొక్క వ్యతిరేకత (1:6-10)
  A. భిన్నమైన సువార్తను ప్రకటించేవారిని పౌలు ఖండించడం (1:6-9)
  B. మనుష్యుల మెప్పు గాక దేవుని మెప్పునే పొందలానే పౌలు ఆశ (1:10)

III. క్రీస్తు సువార్తకు పౌలు యొక్క స్వీయచారిత్రక వాదన (1:11-2:21)
  A. పౌలు యొక్క దైవిక పిలుపు మరియు తొలి పరిచర్య (1:11-24)
    1. ప్రత్యక్షత ద్వారా స్వీకరించబడిన సువార్త (1:11, 12)
    2. సువార్త యొక్క పరివర్తన శక్తి: హింసాత్మకుని నుండి ప్రసంగిగా (1:13-17)
    3. పౌలు ప్రకటించిన సువార్త ఇతరులపై ఆధారపడినది కాదు (1:18-24)
  B. యెరూషలేము యొక్క యోధులతో పౌలు భేటీ (2:1-10)
  C. పౌలు పేతురును మందలించడం (2:11-21)
    1. అన్యులు యూదులవలె జీవించాలని బలవంతము చేయడం (2:11-14)
    2. క్రీస్తునందు విశ్వాసము ద్వారా నీతిమంతునిగా చేయబడడం (2:15-21)

IV. క్రీస్తు సువార్తకు పౌలు యొక్క అనుభవపూర్వక మరియు లేఖనాధారిత వాదన (3:1-5:1)
  A. విశ్వాసము ద్వారా పరిశుద్ధాత్మను పొందడం (3:1-5)
  B. విశ్వాసము ద్వారా అబ్రాహాము నీతిని పొందడం (3:6-9)
  C. యూదులపై ధర్మశాస్త్రము యొక్క శాపము (3:10-14)

D. ధర్మశాస్త్రమునకు పూర్వమే అబ్రాహామునకు వాగ్దానము చేయబడడం (3:15-18)
E. ధర్మశాస్త్రము యొక్క అసమర్ధత (3:19-22)
F. ధర్మశాస్త్రము యొక్క తాత్కాలిక స్వభావము (3:23-4:7)
  1. క్రీస్తు వద్దకు నడిపించే బాలశిక్షకుడు (3:23-39)
  2. బానిసత్వము నుండి దత్తపుత్రత్వమునకు (4:1-7)
G. పౌలు యొక్క వ్యక్తిగత విన్నపము (4:8-20)
  1. గలతీయులు ఆత్మీయమైన బానిసత్వమునకు మరలుట (4:8-11)
  2. గలతీయుల ప్రవర్తన పట్ల పౌలు యొక్క దిగ్భ్రాంతి (4:12-20)
H. హాగరు మరియు శారాల యొక్క రూపకము (4:21-5:1)

V. క్రైస్తవ నడవడిక (5:2-6:10)
  A. క్రీస్తునందు స్వాతంత్ర్యము (5:2-15)
    1. ధర్మశాస్త్రము Vs. క్రీస్తు (5:2-6)
    2. గలతీయుల యొక్క తప్పిదము (5:7-9)
    3. అపొస్తలుని యొక్క స్పందన (5:10-12)
    4. "స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడుట" (5:13-15)
  B. ఆత్మానుసారముగా నడచుట (5:16-26)
    1. ఆత్మ Vs. శరీరము (5:16-18)
    2. "శరీర కార్యములు" (5:19-21)
    3. "ఆత్మఫలము" (5:22, 23)
    4. శరీరముపై ఆత్మ యొక్క విజయము (5:24, 25)
    5. సహోదరులకు అపొస్తలుని యొక్క హెచ్చరిక (5:26)
  C. ఒకరి భారముల నొకరు భరించుట (6:1-10)

VI. ముగింపు మాటలు (6:11-18)

---

సూచనలు

[1]F. F. Bruce, *The Epistle to the Galatians*, The New International Greek Testament Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 1. [2]J. B. Lightfoot, *The Epistle of St. Paul to the Galatians*, Classic Commentary Library (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1957), 2. [3]Ibid., 2-3. [4]నేటికి కూడా ప్రజలు "గాలుల స్వభావము" లేదా "గాలుల హాస్యము"ను గూర్చి మాట్లాడుతుంటారు, కాని వారు సెల్ట్ లలో ఒక తెగను గూర్చి మాట్లాడుతున్నారు అని కూడా కొన్నిసార్లు వారికి తెలియదు. [5]Pausanias *Description of Greece* 10.19.5—10.23.14. [6]Lightfoot, 6. [7]రోమా పాలిత గలతీయ ప్రాంతము యొక్క సరిహద్దుల విషయములో చాలా అనిశ్చితి ఉన్నప్పటికీ కూడా, ఇది నల్ల సముద్రమునకు ఆగ్నేయ దిశ నుండి వికర్ణముగా అంతోలియాకు దక్షిణ-మధ్యనున్న

పంఫూలియా యొక్క సన్నని ఖండము వరకు, అనగా అత్తలియా మరియు పెర్గ అనబడే పట్టణములున్న చోటువరకు విస్తరించి ఉన్నదని చెప్పుటకు చిత్రపటములను కనుగొనడం కష్టము కాదు. ఉదాహరణకు, చూడండి "Map 11: Paul's Missionary Journeys," in *The NIV Study Bible*, ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985). పంఫూలియా ద్వారా గలతీయ ప్రాంతము మధ్యధారా సముద్రము నుండి విభజింపబడుతుంది, దూరము సుమారు ముప్పది మైళ్లు ఉంటుంది. [8]Werner Georg Kümmel, *Introduction to the New Testament*, rev. ed., trans. Howard Clark Kee (Nashville: Abingdon Press, 1975), 297–98. గలతీయలోని దక్షిణ ప్రాంతమును ప్రత్యేకముగా సూచించిన ప్రస్తావన కొరకు అపొ. 14:6, 24లో చూడండి. [9]"పిమ్మట సీరియ, కిలికియ ప్రాంతములలోనికి వచ్చితిని" అని 1:21లో పౌలు వ్రాసాడు. [10]Kümmel, 298.

[11]Lightfoot, 19–20. [12]Merrill C. Tenney, *Galatians: The Charter of Christian Liberty*, rev. ed. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1966), 16. [13]William M. Ramsay, *A Historical Commentary on St. Paul's Epistle to the Galatians*, Limited Classical Reprint Library (Minneapolis: Klock & Klock Christian Publishers, 1978), 3. [14]Ibid., 6. [15]Leon Morris, *Galatians: Paul's Charter of Christian Freedom* (Downers Grove, Ill.: InterVarsity Press, 1996), 17. [16]Bruce, 9. [17]తన మూడవ సువార్త ప్రయాణములో 1 కొరింథీయులకు పత్రికను వ్రాసినప్పుడు పౌలు బర్నబాను గూర్చి ప్రస్తావించాడు (1 కొరింథీ. 9:6). పౌలుతో పాటు బర్నబా కూడా కొరింథు పట్టణమునకు వెళ్లాడు అనడం కంటే, బర్నబాను గూర్చి కొరింథీయులు వినిన విషయమును గూర్చి మాట్లాడే సందర్భములో పౌలు బర్నబా పేరు ప్రస్తావించి ఉంటాడు అనడం సహేతుకం. [18]క్రీ.పూ. రెండవ శతాబ్దములోనే ఈ ప్రదేశమంతటినీ గలతీయగా పరిగణించేవారు అని Ramsay తెలిపాడు. దానిలో నివసించేవారిలో సగము శాతము వారు గాలుల రక్తసంబంధీకులు కాక ఫ్రుగియన్లకు చెందినవారైనప్పటికీ, వారందరు కూడా గలతీయులుగానే పిలువబడ్డారు (Ramsay, 84). [19]Ibid., 79–81. [20]Ibid., 314–15.

[21]Robert L. Johnson, *The Letter of Paul to the Galatians*, The Living Word Commentary (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 25–26. [22]ఈ అంశముపై Johnson విపులమైన చర్చను అందించాడు. (Ibid., 16–26.) ఈయన క్రీ.శ. 55 మరియు 57 మధ్యగల తరువాత తేదీని సూచిస్తూ, గలతీయులకు పత్రిక రెండవ సువార్త ప్రయాణము తరువాత (అంతియొకయ నుండి) లేదా మూడవ సువార్త ప్రయాణములో (ఎఫెసు, మాసిదోనియ, లేదా కొరింథు నుండి) వ్రాయబడి ఉంటుందని చెప్పాడు. [23]గలతీయులు 2:1-10లో యెరూషలేమునకు వెళ్లడం అనేది అపొస్తలుల కార్యములు 11:27-30లో ప్రస్తావించబడిన కరువుకు కొంత చేయూతను స్వీకరించడానికి వెళ్లాడని దీని ద్వారా తెలుస్తుంది. [24]వీరు యెరూషలేము సంఘము నుండి వచ్చి ఉంటారు, కాని అపొస్తలుల ద్వారా గాని లేదా అక్కడి పెద్దల ద్వారా గాని పంపబడి ఉండరు (అపొ. 15:23, 24).